
# సొట్టోడి మాట



రచన : శ్రీ బెహరా ఉమామహేశ్వరరావు

"కుంటోడా? ఒరేయ్...కుంటోడా?"

ఆ కేక వింటూనే వెనుకకు చూసాడు. ఆ చూపుల్లో తీవ్రత అసంతృప్తి కనిపిస్తుంది. అయినా పట్టించుకోకుండా ముందుకు సాగాడు. "ఒరేయ్! నిన్నేరా! ఆ కాలు లేమగాని లేకపోతే నిన్నెవడు పట్టగలడ్రా!" చిరాగ్గా అన్నాడు చిట్టియ్య.

కుంటోడు ఆగాడు. "ఏరా చిట్టిగా! లచ్చయ్య అని పిలవలేవు" అన్నాడు కుంటోడు.

"సర్లేగాని, అవున్నా నీకు వాడలోని నీరు బాగా పడినట్టు వుందేమి?" అడిగాడు చిట్టియ్య,

"ఒరేయ్ చిట్టి మాటలు సరిగారాని..."

"ఏట్రోయ్, మాటలు మా సెడ్డ జోరుకుంటున్నాయి."

"కాకపోతే ఏట్రా! మాటాడితే కుంట్రోడా అంటావు. నీరు పడిందంటావు?"

"నేనన్నదాంట్లో అబద్దమేటుందిరా."

"చిట్టియ్యా! ఒకమాట సెబుతాను, యింటావా...!" కుంటి లచ్చయ్య కర్ర ముందుకువేసి కదిలాడు. వాడివెంట చిట్టియ్య కదిలాడు.

"ఏటా సెప్పేది" కుంటోడి ముఖంచూసి అడిగాడు చిట్టియ్య, ఆశ్చర్యపడుతూ.

"ఒక్కనాడైన బొరిసెడి గెంజి పోసావట్రా, అదేదో కష్టాల్లో ఆదుకున్నోడిలా మాటాడుతున్నావు."

"ఓరెనా కొడకా! పిన్నమ్మ కొడుకువా! పెద్దమ్మ కొడుకువా, నేను నీకు గంజి ఎందుకు పోస్తాన్రా?" కోపంగా అన్నాడు చిట్టియ్య.

"అట్టాటోడివి, వాడలోని నీరు నాకు సరిపడింది అంటావేటిరా" నిష్టురంగా అన్నాడు సొట్టలచ్చయ్య.

"నిజం సెబితే కష్టంగా ఉంటాదటరా, సరేకాని ఈ వాడలోకి సేరిన తరువాత కదరా నీవు ఒళ్లు సేసింది."

"నాయాల నా మాట వినురా."

"ఏటది!?"

"ఇన్ని ఇళ్ళల్లో మెతుకులు కతికి నానంటావు గదా! ఎవడింటికాడ నేను తిన్నది."

"అక్కి ఎవడింటికాడ తిన్నావని కాదురా సొట్టోడా! ఎవడో ఏసిన గింజలు వండుకొని తిన్నావు కదురా."

"అలా దారికి రారా, చిట్టి!" సంతృప్తిగా అంటూ తక్కున ఆగాడు లచ్చయ్య.

"ఏంరా! అలా ఆగిపోయావు?" ఆశ్చర్యంగా అడిగాడు చిట్టియ్య.

"ఒరే నిన్నొకటి అడగన్రా!"

"ఏటది? అడుగు!?"

"నీ యింటి యెనక్కి పసువులశాల వుంది గదా, అందులో నాల్రోజులు వుండనీరా."

"అదేటది?" జాబులో చుట్టముట్టిస్తూ కదిలాడు చిట్టియ్య.

"నీ ఇంటి యెనక ఉంది గదా! అదే?" నొక్కి నొక్కి చెప్పాడు లచ్చయ్య.

"అదేటిరోయ్ సుట్టరికం కలిపేద్దాం అనుకుంటున్నావా?"

"నా కొడకా! ఎంగిలిసేత్తో..."

"ఆ పాక కావాలంతే, పది రూపాయలు యిచ్చుకో."

"ఒక పదే కదా?"

"అర్నీ అదేంకుదరదు నెలకు పది రూపాయలు ఇత్తానంటే సూడు మరి!"

"అరే చిట్టియ్యా వస్తున్నది సీతాకాలంరా. ఎవడి అరుగు మీద తొంగున్నా కొయ్యబారిపోతానురా. నీకు పుణ్యముంటది గదరా! మరి నీకష్టం నేనుంచను గదరా."

"అది సరేకాని. మాయమ్మి వుంది గదా, దాన్ని అడిగి సూడాలి."

"ఎవరది సీతాలేనా?"

"మరింకెవరురా."

"చిట్టియ్యా! సీతాలుది బంగారంలాంటి మనసు. అది నా మాట కాదంటాదేటి?"

"సర్లే."

"ఇదిగో, మరొక్కమాట నాదీ?"

"ఏమిటది?"

"ఆ పాకలో నేను వంటకూడా సేసుకొంటా మరి, చుట్టూ పొగా, గిగా అవుతుంది సుమా! చిట్టియ్యా!"

"ఓసీ అదా, సరేకాని లచ్చయ్యా పెందలాడే బయలు దేరినావు కదా, ఎక్కడికిపోయి వస్తున్నావురా" అడిగాడు చిట్టియ్య.



"చిట్టియ్యా! నీలాగే టౌను ఎళ్లొస్తున్నాను మరి,"

ఆ మాటలు వింటూనే చిట్టియ్య మనస్సు చివుక్కుమంది.

"అరేయ్ సొట్టా! నాకూ, నీకూ సాటవేటిరా, నేనంటే గ్రామ తలారీని, నీవో..." అంటూ కసుక్కుమన్నాడు చిట్టియ్య. శంకలో కర్ర ముందుకేసి కాలీడ్చుకుంటూ వస్తున్న లచ్చయ్య ఆగి, 'చిట్టియ్యా, చిట్టియ్యా...' గట్టిగా నవ్వసాగాడు.

'ఏటిరోయ్ ఆ నవ్వు, సెప్పేది సరిగా సెప్పరా.'

'ఈ రోజు పోలీసు దొరగారి ఇంటిలో పెళ్ళి' అని చెప్పాడు లచ్చయ్య.

'నిన్నేం రమ్మన్నాడ్రా?'

'అట్టాంటిదేం లేదుగాని...'

'మరి ఎందుకు పోయినావురా.'

'ఆ దొరబాబు బీదోళ్ళకికూడా భోజనాలు పెట్టినాడు. అంచేత ఎళ్లొచ్చినాను.

'లచ్చయ్యా, నీకు పెద్దోల్ల సావాసముందేటిరా?'

అరే నా బతుకనగా ఎంత? చూడు చిట్టియ్యా, రేపే మీ పెరటిలోని పాకలోకి మకాం మార్చిస్తున్నాను.'

'మరి కిరాయిమాట.'

'నాదే కిరాయి బతుకు, యింకా నీకు...' అని ఆగాడు లచ్చయ్య.

'సొట్టాడా! మాటమాటే, యాపారం యాపారమే. నెలకి యింత అను, నేను ఒప్పుకుంటాను.'

'చిట్టియ్యా నెలకి పదిచ్చుకుంటాన్లే సరేనా.'

మాటల్లో చిట్టియ్య, లచ్చయ్య వాడకు చేరుకున్నారు.

లచ్చయ్య వస్తానని చెప్పి కదిలాడు. తన ఇల్లు రాగానే చిట్టియ్య ఆగిపోయాడు. 'ఏమి బతుకు ఈడిది, మా వాడలోని బురదలో మురిగే నల్లపందిలాంటోడు ఈడు, ఈడికి కావలసింది పెరట్లోని గుడిసె. సరే సూద్దాం, అని మనసులో అనుకుంటూ, నడుంవంచి ఇంట్లోకి దూరాడు చిట్టియ్య.

లచ్చయ్య అంటే ఆ వాడలో తెలియని వాడు ఎవడు లేదు. ఎవరితోనైనా కలుపుగోలుగా మాటాడగలడు. చెట్టెక్కి చిన్నప్పుడు పడ్డాడట. కాలుకాస్తా విరిగింది. ఆ మాట కూడా లచ్చయ్య చెబితేనే తెలిసింది. కాలు విరిగి నందుకు వాడలోని పిల్లలందరూ 'సొట్టోడా! సొట్టోడా' అని పిలుస్తారు. కాని పట్టించుకోడు. అదే జ్ఞాన మెరిగిన వాడు ఎవడైనా అలా పిలుస్తే తారాజువ్వలా మీదకు ఎగురుతాడు. అంతేకాదు, వాడలో ఎవరింటికాడ భోజనం చేసిన పాపాన పోడు. ఊరిలో బిచ్చమెత్తుకుని బ్రతుకుతాడు. బ్రతుకు అంటే తీపి, అందుకే ఏమో గాలివాన వస్తే చాలు చెట్టు క్రిందనుండి వచ్చి, గట్టిపాక ఎక్కితే ఆ




## కావలెను

చిరకాలముగా మేము తయారుచేస్తున్న ఆర్టు, సిల్కు జమకాళాలు, నూలు జమకాళాలు, కలర్ బెడ్‌షీట్స్ వగైరాలకు ఆర్డరు బుక్ చేయుటకు మంచి అనుభవజ్ఞులైన వారినుండి కమిషన్ పద్ధతిపైన దరఖాస్తులు కోరబడుచున్నాము.

—: వివరములకు :—

Phone : 731 P. B. No. 61

# Kumareshan Textiles

PALANI ANDAVAR KOIL ST., BHAVANI—638 301.

gi

జి. ఐ.

ISI

IS - 9079

* ఎలెక్ట్రిక్ మోటారులు
* పంపు సెట్లు
* మోనోబ్లాకులు

మేము స్క్రీన్ ప్రొటెక్టెడ్ డ్రిప్ స్క్విరల్ కేజ్ ఇండక్షన్ మోటారులను 2, 3, 5, 7, 5 & 10 H.P. లలో 400/440 వోల్టులో 50 సైకిల్స్ ఎ. సి. సప్లైకు తగినట్టుగా తయారుచేయుచున్నాము



వివరములకు :

Phone : Office · 31387 Resi : 33268

Gopalakrishna Industries

163, PATEL ROAD : : COIMBATORE-641 009,


పాకలో చేరుతాడు. వర్షం వెలియగానే చెట్టు క్రిందకు చేరుతాడు నిద్రవస్తే చాలు ఎక్కడో ఒక దగ్గర కునుకు తీస్తాడు. నిద్ర సుఖమెరుగదు అంటాడు. మాసిన గడ్డం అరవై నాలుగు చిరుగులు, ముప్పయి కుట్లుతోవున్న చొక్కా సగం చిరిగిన ఫేంటు, చింపిరి జుత్తులు వెరసిన లచ్చయ్య పొద్దుటే కాలీడ్చుకుంటూ ఊరిలోకి పోతాడు. సాయంత్రం జోలి నింపుకుని వాడకు చేరతాడు. ఏ ఇంటి కష్టమైన తనదిగా భావించే మనసు లచ్చయ్యది. అందుకే కష్టాలు వచ్చిన గుమ్మంలో వాలి, కాస్తా పరామర్శచేసి వస్తాడు. పస్తులు పడుకున్న కొంపలకి ఏదో ఇన్ని గింజలు కూడా సర్దుతాడు. అందుకే కుంటి లచ్చయ్య అంటే వాడలో అందరికి అభిమానమే మరి.

తెల్లారి లేస్తునే పళ్ళు పుడకను కుంచె చేసి తోముతున్నాడు. సీతాలు అటుగా పోతోంది.

"ఏయ్, నిన్నే!" అని పిలిచి ఆగాడు.

సీతాలు కాస్సేపు ఆగి, వెనక్కి చూసింది. రోషంతో ముక్కుపుటలు ఎగరేస్తూ ముందుకు కదిలింది.

"ఏయ్ సీతాలూ, నిన్నేనే!..." అని మరలా పిలిచేడు లచ్చయ్య.

"అలా దారికిరా, పేరెట్టి పిలగూడదా, ఏటి?" అంది సీతాలు కస్సుమంటూ.

లచ్చయ్య ఫకాలున నవ్వి 'ఏదో, సిన్నదానవని అలా పిలిసాన్లే' అన్నాడు చనువుగా చూస్తూ.


"నీకు సొట్టాడా, అంటే ఎలాగ కస్సుమంటూ లేస్తావు, నీలాగే?" అంది సీతాలు.

"వయసులోవున్న దానివి ఆపాటి పౌరుషం నీకు ఉండదా ఏటి? సెప్పు" చనువుగా అడిగాడు లచ్చయ్య.

"అదిగో ఆ మాటే వద్దు. సర్లే, ఇంతకీ నన్ను ఎందుకు పిలిచినట్టు" సందేహంగా అడిగింది సీతాలు.

'ఇదిగో, మరేం...మరేం' అంటూ ఆగాడు లచ్చయ్య.

'అదే నీకు పోలేదు. అడిగేది సరిగా అడుగు' లచ్చయ్య కళ్ళలోకి సూటిగా చూస్తూ అడిగింది.



లచ్చయ్య తత్తరపడుతూ, 'మరి నువ్వు కాదంటావనే, నా భయం' అన్నాడు.

'కాదంటే తప్పా?' అని ఎదురు ప్రశ్న వేసింది.

లచ్చయ్య నవ్వుతూ, 'అదిగదిగో, అల్లాంటి దురుకు తనమే నీకు వద్దంటా' అన్నాడు.

'సరేకాని లచ్చయ్యా, నేను కోనేరుకుపోవాలి. అసలు ఎందుకు పిలిచావో సెప్పు, లేకపోతే నేనెల్లిపోతాను' అంది సీతాలు. ఆ మాటల్లో పొగరు, దురుకు మిళితమై వుంది.

లచ్చయ్య మెల్లిగా వెనక్కిచూసి, ''పోనీలేయే ఇప్పుడు రాకపోతే సాయంత్రం కలవమా ఏమిటి?'' అన్నాడు.

సీతాలు తత్తరపడుతూ, ''మామా! చూడు'' అంటూ నాలుక కరచుకుంది టక్కున.

''ఏమే, నాలుక అలా కరుచుకుంటావేటే, మామా అని పిలు, నీకు మేనమామలాంటోడ్నే కదా,'' అన్నాడు లచ్చయ్య ఆప్యాయత చూపిస్తూ.

''చూడు లచ్చయ్యా నీ మనసులోని మూడు ముక్కలు అడగేస్తు, మొగమాట పడతావేటి. నీకు నేను కాదంటానా'' అంది సీతాలు.

''అగ్గది, అలా దారికిరా, కష్టం, సుఖం మాటాడుకుందాం.''

''సరే చెప్పు లచ్చయ్యా.''

''ఇంకా వచ్చేది సీతాకాలం కదా!''

''అయితే?''

''అయితే గియితే కాదే! చలికి నే సత్తాను అందుకే'' అంటూ నసిగాడు లచ్చయ్య.

''అందుకే'' కనుబొమలు ఎగరేసి అడిగింది సీతాలు.

''మరి మీ ఇంటి వెనక్కి పాక వుంది కదా!'' అని నీళ్ళు నమిలాడు లచ్చయ్య.

''ఆ పాక నీకు కావాలంటావు అంతేనా!''

''అబ్బ, ఎంతవేగి పోల్చీసావు! భలే గట్టిదానివి.'' నాలుక రెండు పెదవులమధ్య నొక్కి అన్నాడు.

''సూడు లచ్చయ్యా! నీకు ఆ పాక కావాలి. అందులో నీవు ఉంటానంటావు. అవునా?'' అని నొక్కి అడిగింది సీతాలు.

'అవునే!' అంటూ ముక్తసరిగా లచ్చయ్య జవాబు చెప్పాడు.

'అయితే వుండు.'

'మరి మీ నాయనా!'

'ఏం ఆడేటి అన్నాడు?' వింతగా అడిగింది సీతాలు.

'నెలకి పదిరూపాయలు బాడుగ కావాలట, మీ నాయన అడిగేడు' అని చెప్పేడు లచ్చయ్య.

'ఆఁకడు! ముసిలి ముండాకొడుకు. డబ్బంటే చాలు, గడ్డి అయినా సూడడు' కోపంగా అంది సీతాలు.

'చూడు సీతాలు! సిన్నదానివి డబ్బు విలువ నీకు తెలవదు. మీ అయ్య అన్నది నిజమే,' అని లచ్చయ్య అన్నాడు.

'అయితే ఏటి సెబుతావు, మరి!'

'అదే ఈ ఇరవై నోటు వుంచు, సీతాకాలం తీరేదాక, నాకు చోటియ్యి. తరువాత నీ ఇష్టం' అని బ్రతిమలాడాడు లచ్చయ్య. సీతాలు మాత్రం మొహమాటపడుతూ ఇరవై నోటు తీసుకుంది.

'నా మాట కాదనక' అని చెప్పాడు లచ్చయ్య.

'సరే,' అంటూ సీతాలు కదిలింది.

[సశేషం]

